సాక్షి
సంగారెడ్డి
సోమవారం, 24, జూన్, 2024

అమ్మఒడిలా.. సర్కారు బడి



చిన్నారుల బుడిబుడి అడుగులు వడివడిగా సర్కారు బడివైపు పడుతున్నాయి. భవితకు బాటలు వేస్తున్నాయి. 'అమ్మఒడి'లా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతుండటమే ఇందుకు కారణం. ప్రతీ బడి ప్రైవేటుకు దీటుగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసింది. ఈ నేపథ్యంలో అన్నీ పాఠశాలల్లోనూ దాదాపు అభివృద్ధి పనులన్నీ పూర్తయ్యాయి. ఇప్పటికే కొన్ని చోట్ల సర్కారు బడులకు క్రేజ్ పెరిగింది. నో అడ్మిషన్ బోర్డులు సైతం వెలుస్తుండటం గమనార్హం.

వివరాలు 8లో ▶



నాడు

సంగుపల్లి ప్రాథమిక పాఠశాలలో పెచ్చులూడిన పైకప్పు



నేడు

మరమ్మతులు చేపట్టిన అనంతరం పైకప్పు

మరమ్మతులతో కొత్తరూపు

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టింది. సంగుపల్లి పాఠశాలలోని తరగతి గదులు, వరండాలో పైకప్పు పెచ్చులూడిపోయిన చోట మరమ్మతు పనులను చేపట్టారు. దీని పక్కనే ఉన్న మరో భవనం వద్ద పెరిగిన చెట్లును తొలగించి దానిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మరమ్మతులు చేశారు. అలాగే మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పాలనలో రైతే రాజు



సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నీలం మధు తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): కాంగ్రెస్ పాలనలో రైతే రాజు అని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ నేత నీలం మధు అన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించడంతో సీఎం రేవంత్‌తో పాటు మంత్రి దామోదర రాజనర్సింహ్మల చిత్రపటాలకు ఆదివారం జిన్నారంలో క్షీరాభిషేకం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం కాంగ్రెస్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ రవీందర్‌గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డె కృష్ణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి టౌన్: పోరాటాల ద్వారానే కార్మికుల హక్కులు సాధించుకుందామని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు అన్నారు. ఆదివారం స్థానిక కేవల్ కిషన్ భవన్‌లో వరుణ్ బేవరేజ్ కార్మికుల జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔటర్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 10న దేశవ్యాప్త డిమాండ్ డేలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మల్లేశం, నాయకులు బలరాజు ప్రేమ్ కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.

మురళీకృష్ణ ఆలయంలో బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని శ్రీమురళీకృష్ణ ఆలయ బ్రహ్మోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మూలమంత్రం హోమం, వైనతీయ నిత్యహోమం, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, నిత్యపూర్ణాహుతి, కుంకుమార్చన నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతాయని ఆలయ అర్చకులు లక్ష్మణ్ తెలిపారు.

సింగూరుకు వరద



సింగూరు ప్రాజెక్టులో నీటి నిల్వ

- 578 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ 13.520 టీఎంసీలు

పుల్‌కల్(అందోల్) : సింగూరు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో మొదలైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి డ్యాంలోకి వరద నీరు చేరుతుంది. ఆదివారం డ్యాంలోకి 578 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరిందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్ రెడ్డి తెలిపారు. డ్యాం ఎగువభాగంలో పుల్‌కల్, మునిపల్లి, వట్‌పల్లి, రాయికోడ్ మండలాలలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి వరద నీరు వస్తుందని అధికారులు తెలిపారు. డ్యాం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917టీఎంసీలు కాగా... ప్రస్తుతం 13.520 టీఎంసీల నీరు నిల్వ ఉందని తెలిపారు. మిషన్ భగీరథకు 70 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రో వాటర్‌కు 80 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

దళారుల దందా.. అధికారుల అండ..!?

- అడిగినంత ఇవ్వాల్సిందే.. లేదంటే అడ్డంకులే
- పరిహారం అందకుండా పెండింగ్ పెడతామంటూ హుకుం
- అమాయక రైతుల నుంచి దండుకుంటున్న అక్రమార్కులు
- ఆర్‌ఐ ఏసీబీ కేసుతో వెలుగుచూసిన దందా

నిమ్జ్ భూసేకరణలో యథేచ్ఛగా అమ్యామ్యాల పర్వం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: వారంతా తమ వ్యవసాయ భూములను కోల్పోతున్న నిర్వాసితులు.. తరతరాలుగా సాగు చేసుకుంటున్న పంట పొలాలను సర్కారుకు అప్పగిస్తున్న త్యాగధనులు.. తమ జీవనాధారం కోల్పోతున్న ఆ అన్నదాతలకు ప్రభుత్వం ఇచ్చే అరకొర పరిహారంపై డబ్బులపై అక్రమార్కుల కన్ను పడింది. దళారులుగా అవతారమెత్తిన కొందరితో రెవెన్యూ అధికారులు జతకట్టారు. ఇంకేముందీ.. పెద్దఎత్తున వసూళ్ల దందాకు తెరలేపారు. సర్వం కోల్పోతున్న అన్నదాతల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. నిమ్జ్ భూసేకరణ ప్రక్రియంలో ఈ దందా ఇప్పుడు యథేచ్ఛగా సాగుతోంది. అవినీతి నిరోధకశాఖ అధికారులకు చిక్కిన న్యాల్‌కల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దుర్గయ్య ఘటనే ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ ఘటనతో నిమ్జ్ భూసేకరణలో జరుగుతున్న అక్రమాల బాగోతం వెలుగులోకి వచ్చినట్లయింది.

అసైన్డ్ రైతులే టార్గెట్‌గా..

అక్రమార్కులు అసైన్డ్ రైతులను టార్గెట్ చేస్తున్నారు. తాము సక్రమంగా రాస్తేనే ఈ అసైన్డ్ రైతులకు పరిహారం అందుతుందని.. లేదంటే పరిహారం రాకుండా పోతుందని మభ్యపెడుతున్నారు. తమకు పర్సంటేజీ ఇస్తేనే పరిహారం వచ్చేలా రిపోర్టు రాస్తామని రెవెన్యూ అధికారులు అసైన్డ్ రైతులను ప్రత్యక్షంగా, పరోక్షంగా బెదిరింపులకు దిగుతున్నారు. ఆయా గ్రామాల్లో కొందరు దళారులను నియమించుకుని ఈ వ్యవహారాన్ని నడుపుతున్నారు. దీంతో తమకు వచ్చే పరిహారం అందకుండా అధికారులు కొర్రీలు పెడతారనే ఆందోళన చెందుతున్న రైతులు.. దళారులు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి ఓ అసైన్డ్ రైతు నుంచి రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా దుర్గయ్య పట్టుబడటం గమనార్హం.

ఇద్దరు ఎస్‌డీసీల నియామకం

నిమ్జ్ (నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ జోన్ - ఎన్‌ఐఎంజెడ్) ఏర్పాటు కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ దాదాపు రెండేళ్ల అనంతరం మళ్లీ షురువైంది. అసెంబ్లీ ఎన్నికలకు సంవత్సరం ముందు వరకు తొలి విడత భూసేకరణ ప్రక్రియ కొనసాగింది. అసెంబ్లీతో పాటు, పార్లమెంట్ ఎన్నికలు కూడా ముగియడంతో ప్రభుత్వం మళ్లీ ఈ నిమ్జ్ భూసేకరణపై దృష్టి సారించింది. ఇందుకోసం ఇద్దరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లకు (యూనిట్-1, యూనిట్-2) ప్రభుత్వం ఇటీవలే పోస్టింగ్ ఇచ్చింది.

సుమారు 3,500 వరకు అసైన్డ్ భూములు

నిమ్జ్ కోసం జిల్లాలో మొత్తం 12,635 ఎకరాల భూమిని సేకరించాలని గతంలో నిర్ణయించారు. మొదటి విడత, ఇటీవల షురువైన రెండో విడతల్లో కలిపి ఇప్పటి వరకు 5,796 ఎకరాలను సేకరించారు. ఇందులో సుమారు 3,500 ఎకరాల మేరకు అసైన్డ్ భూమి ఉంటుంది. తొలివిడతలో ఐదు గ్రామాలు ఝరాసంగం మండలం బర్దీపూర్, ఎల్గోయి, చీలపల్లి, న్యాల్కల్ మండలం రుక్మాపూర్, రుక్మాపూర్ తండా, ముంగి గ్రామాల పరిధిలో భూసేకరణ కొనసాగింది. ఇప్పుడు రెండో విడతలో 12 గ్రామాల పరిధిలో భూసేకరణ చేపట్టారు. న్యాల్కల్ మండలం గణేషాపూర్, మెటల్ కుంట, రేజింతల్, న్యామతాబాద్, మామిడ్గి, గుంజోటి, బసంత్పూర్, గంగ్వార్, మొల్కన్పాడ్, కల్బేమల్, హద్నూర్, హుసెల్లి గ్రామాల్లో భూములను సేకరిస్తున్నారు. అవార్డు ఎంక్వైరీ స్థాయిలో కొన్ని, అవార్డు ప్రకటన ఇలా ఈ భూసేకరణ ప్రక్రియ ఇప్పుడు వివిధ దశల్లో ఉంది. ఈ క్రమంలో దళారులు, కొందరు రెవెన్యూ అధికారులు సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. అమాయక రైతుల వద్ద వసూళ్ల దందాకు పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ క్రమంలోనే ఏసీబీ దాడులు జరగడం ఈ అక్రమ దందా వెలుగులోకి వచ్చినట్లయింది.

మా దృష్టికి వస్తే కఠిన చర్యలు

నిమ్జ్ భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి అక్రమాలకు తావులేదు. పరిహారం కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకురావాలి. వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. భూములు కోల్పోతున్న రైతులకు నిబంధనల మేరకు పరిహారం చెల్లిస్తాం. దళారుల వ్యవహారం మా దృష్టికి రాలేదు.

నాగలక్ష్మి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నిమ్జ్ భూసేకరణ యూనిట్-1

ముఖర్జీ సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

సంగారెడ్డి: బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద శ్యాం ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు ద్వారకా రవి ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ రాజు గౌడ్, కౌన్సిలర్ నాగరాజు, జిల్లా కార్యాలయ కార్యదర్శి విజయకుమార్, జిల్లా సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనా గౌడ్, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు నరేన్ దేశ్ పాండే, వినోద్, యశ్వంత్, భిక్షపతి, తేజస్విని, లక్ష్మి, సంతోషి భాయ్, కవిత, లింగమూర్తి, సందీప్, అజయ్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాధాగోవింద రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: పట్టణంలో ఆదివారం రాత్రి రాధాగోవింద రథయాత్ర ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌లోని హరేరామ హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో తొలిసారి రథయాత్ర నిర్వహించారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు పూజలు నిర్వహించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక శివాజీ విగ్రహం నుంచి ప్రారంభమైన యాత్ర ప్రధాన రహదారి గుండా షెట్కార్ ఫంక్షన్‌హాల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా హరే కృష్ణ కీర్తనలు, భజనలు, నృత్యాలు, సంకీర్తనల మధ్య భక్తులు రథాన్ని లాగారు.

ఆర్టీసీ బస్సులో మెదక్ కలెక్టర్



నర్సాపూర్ బస్టాండ్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్ రూరల్: కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదివారం ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులో ప్రయాణించారు. కుటుంబ సభ్యులతో కలిసి మెదక్ నుంచి నర్సాపూర్ వరకు ప్రయాణికులతో కలిసి వచ్చారు. నర్సాపూర్ బస్టాండ్‌లో బస్సు దిగి హైదరాబాద్‌కు సొంత కారులో బయలుదేరి వెళ్లారు. అయితే ప్రయాణికులు కలెక్టర్‌ను గుర్తించ లేదు. సాధారణ ప్రయాణికుల మాదిరిగా తోసుకుంటూ బస్సు దిగడం కనిపించింది. అదే బస్సులో ప్రయాణించిన ఇతర ప్రయాణికులు కలెక్టర్‌ను అభినందించారు.

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి



ఎల్కల్‌లో సమావేశమైన భూనిర్వాసితులు

రాయపోలు(దుబ్బాక): రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని ఆర్‌ఆర్‌ఆర్ భూ నిర్వాసితుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాయపోలు మండలం ఎల్కల్‌లో భూనిర్వాసితులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు సాగుచేసుకుంటున్న భూములను లాక్కొని ప్రభుత్వాలు వారిని రోడ్డున పడేస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటి వరకు ట్రిపుల్ ఆర్ కోసం సేకరించిన భూమికి బదులుగా రైతులకు భూమి ఇవ్వాలని, లేదా మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదా అలైన్‌మెంటు మార్చాలన్నారు. కార్యక్రమంలో చేసిన పలు తీర్మానాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

కరుణించు.. కరుణామయా



భక్తుల ప్రార్థనలు

మెదక్‌జోన్: మెదక్ సీఎస్‌ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పర్యాయాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవసందేశం ఇచ్చారు. కాగా దూరప్రాంతాల నుంచి తరలివచ్చిన వారికి ఇబ్బంది కలగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

జనసంద్రం.. ఏడుపాయల



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట(మెదక్): ఎల్లలు దాటి తరలి వచ్చిన భక్తులతో ఆదివారం ఏడుపాయల జనసంద్రంగా మారింది. అర్చకులు వనదుర్గమ్మను పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు బోనాలు తీసి, ఒడిబియ్యం సమర్పించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. చెట్ల కింద టెంట్లు వేసుకొని వన భోజనాలు చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ చైర్మన్ బాలగౌడ్ చర్యలు తీసుకున్నారు.

సందడిగా.. నాచగిరి క్షేత్రం



స్వామివారి సన్నిధిలో భక్తులు

వర్గల్(గజ్వేల్) : నాచగిరి లక్ష్మీ నృసింహ క్షేత్రం ఆదివారం భక్తులతో అలరారింది. వారాంతపు సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తజనులు క్షేత్రానికి తరలివచ్చారు. పుణ్యస్నానాల అనంతరం గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకం, సత్యనారాయణ వ్రతం, కల్యాణాది మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రంలో 15 వ్రతాలు, 8 అభిషేకాలు జరిగాయి. ఆలయ ఈఓ అన్నపూర్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రియల్ మోసం!

- రెచ్చిపోతున్న రియల్టర్లు
- అప్రోచ్ రోడ్డు లేకుండానే వెంచర్లు
- ప్లాట్లుగా మార్చి విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు



సదాశివపేట ఊబచెరువు కట్ట నీరు వెంచర్‌లోకి వెళ్లకుండా తీసిన కాలువ



వెంచర్‌ను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

సదాశివపేట(సంగారెడ్డి): రియల్టర్లు పంట పొలాలను కూడా వదలకుండా వ్యాపారం సాగిస్తున్నారు. తక్కువ ధరకు రైతుల నుంచి భూములు కొనుగోలు చేసి నిబంధనలు పాటించకుండా ప్లాట్లుగా మార్చుతున్నారు. వాటిని అమాయకులకు అంటగట్టి సొమ్ముచేసుకుంటున్నారు. ఇలా సదాశివపేట పట్టణంలోని ఊబచెరువు దిగువన వెంచర్లు ఏర్పాటు చేశారు. వీటికి ప్రధాన రహదారి లేకున్నా ప్లాట్ల విక్రయం మొదలు పెట్టారు. అప్రోచ్ రోడ్డు లేకుండా ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెంచర్ల ఏర్పాటుకు ఎన్‌ఓసీ ఇవ్వడం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇలా అనుమతులు లేకుండా సదాశివపేటలో వెంచర్లు వెలుస్తున్నాయి. ఇది తెలియక ప్లాట్లు కొనుగోలు చేసి అమాయకులు మోసపోతున్నారు.

ప్రమాదంలో చెరువు కట్ట

రియల్టర్ల ధనదాహానికి ఊబచెరువు కట్ట ప్రమాదంలో పడింది. కట్టకు ఆనుకుని వేసిన వెంచర్లకు మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల నివేదిక ఆధారంగా గతంలో ఇక్కడ పనిచేసిన కలెక్టర్ శరత్ కుమార్ అనుమతి ఇచ్చారు. అలాగే చెరువు బఫర్ జోన్ నుంచి వెంచర్‌కు రోడ్డు వేసేందుకు అనుమతిచ్చారు. దీంతో నిర్వాహకులు గత ఏప్రిల్‌లో ఊబచెరువు మినీ ట్యాంక్‌బండ్ ఇనుప గ్రిల్స్‌ను తొలగించి వెంచర్‌కు వెళ్లేందుకు కచ్చా రోడ్డు ఏర్పాటు చేసుకున్నారు. కట్టకు దిగువన ఉన్న కట్టమైసమ్మ ఆలయాన్ని కూడా ధ్వంసం చేశారు. ఆగ్రహించిన మత్స్య సహకారసంఘం నాయకులు ధర్నా దిగడంతో మందిరం నిర్మిస్తామని వెంచర్ నిర్వాహకులు హామీ ఇచ్చారు. కట్టను ధ్వంసం చేస్తూ అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నట్లు ప్రజాసంఘాల నాయకుల దృష్టికి వెళ్లడంతో వివాదస్పదమైంది. మినీట్యాంక్ బండ్‌గా పిలవబడే ఊబచెరువు కట్ట మీదుగా బైక్‌లు, మూడు చక్రాల వాహనాలకు మాత్రమే అనుమతి ఉంది. చెరువు సమీపంలో ఏర్పాటు చేస్తున్న వెంచర్ల కోసం వస్తు సామగ్రిని తరలించేందుకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీనివల్ల మినీ ట్యాంక్‌బండ్ రోడ్డు చాలావరకు ధ్వంసమైంది.

అధికారుల వివరణ..

జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదాశివపేట మున్సిపల్ కమిషనర్ ఉమ, తహసీల్దార్ సరస్వతి ఈనెల 14వ తేదీన ఊబచెరువు కట్టను పరిశీలించారు. అక్రమంగా వెంచర్ అప్రోచ్‌రోడ్డు నిర్మిస్తున్న విషయం వాస్తవమేనని గ్రహించి ఉన్నత అధికారులకు నివేదిక పంపించామని తహసీల్దార్ సరస్వతి తెలిపారు.

నిబంధనలు ఇవీ..

వ్యవసాయ భూములను ప్లాట్లుగా మార్చి విక్రయించాలంటే నాలా కన్వర్షన్ ద్వారా ఆర్డీఓ నుంచి ఉత్తర్వులు పొందాల్సి ఉంటుంది. అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానింగ్ నుంచి పర్మిషన్ తీసుకోవాలి. డీటీసీపీ అనుమతి కోసం నీటిపారుదల, రెవెన్యూ, మున్సిపల్ శాఖల నుంచి ధ్రువీకరణ ప్రతాలు జతచేయాల్సి ఉంటుంది. వెంచర్‌లో పదిశాతం స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్ చేయాలి. వెంచర్‌కు అప్రోచ్ రోడ్డు 60ఫీట్లు, లోపల 40ఫీట్ల రోడ్డు, 33 ఫీట్ల వెడల్పు రోడ్డు ఏర్పాటు చేయాలి. కానీ ఊబచెరువు సమీపంలో ఏర్పాటుచేస్తున్న వెంచర్లకు లేఅవుట్ మ్యాప్‌లో చూపించినట్లు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలమే లేదు. అందువల్ల ఊబచెరువు కట్టను దర్జాగా తవ్వి అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

అనుమతులు రద్దు చేయాలి

ఊబచెరువు కట్టను ధ్వంసం చేసి వెంచర్లకు అప్రోచ్ రోడ్డును నిర్మిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. పెద్దల పేరు చెప్పి నిర్వాహకులు బెదిరింపులకు దిగుతున్నారు. మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం గురించి వేసిన ఇనుప గ్రిల్స్‌ను తొలగించి రోడ్డు వేస్తున్న విషయం కలెక్టర్ వల్లూరి క్రాంతికి ఫిర్యాదు చేశాం. వెంచర్ అనుమతులు వెంటనే రద్దు చేయకపోతే నిరాహార దీక్షకు దిగుతాం.

– కొత్తగొల్ల సత్తయ్యయాదవ్, టీజేఏసీ జిల్లా చైర్మన్

క్లుప్తంగా

చెరువులో దూకి యువకుడి ఆత్మహత్య

చేగుంట(తూప్రాన్): యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన చేగుంటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన తిరుపతి సాయికుమార్(21) స్నేహితులతో గొడవ పడ్డాడు. ఈ గొడవలో అతడి స్నేహితులు గాయపడగా వారు తనను ఏం చేస్తారో అని భయపడి స్థానిక ఊర చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేసుకొని మృతదేహాన్ని చెరువులో నుంచి బయటకు తీశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

పెళ్లికి నిరాకరించాడని యువతి..

వర్గల్(గజ్వేల్): యువతి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం వర్గల్ మండలం దండుపల్లిలో చోటు చేసుకుంది. బేగంపేట ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దండుపల్లికి చెందిన కాస రమేశ్ దంపతుల చిన్న కూతురు(17) గజ్వేల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. గజ్వేల్ మండలం బంగ్లా వెంకటాపూర్‌కు చెందిన బోయిని స్వామి, యువతి కొద్ది రోజులుగా ప్రేమించుకుంటున్నారు. ఇదే విషయం శనివారం సాయంత్రం ఆమె కళాశాల నుంచి తిరిగొచ్చిన తర్వాత తల్లికి చెప్పింది. పెళ్లి చేసుకోమంటే స్వామి ఒప్పుకోవడం లేదని పేర్కొంది. ఇదే విషయంలో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లగా మధ్యాహ్నం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి కాస రమేశ్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. గ్రామంలో విషాదం అలుముకున్నాయి.

ఆర్టీసీ కార్మికుల కథనానికి స్పందన

హర్షం వ్యక్తం చేస్తున్న కార్మికులు


సిద్దిపేటకమాన్: ఆర్టీసీ కార్మికులపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీసీ కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భద్రత లేని బతుకు బండి.. ఆర్టీసీలో పనిభారం, కార్మికుల కకావికలం పేరుతో ఆదివారం 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై ఆర్టీసీ కార్మికులు చర్చించుకున్నారు. సోషల్ మీడియాలో సైతం వైరలైంది. అదే విధంగా ఆర్టీసీ ఉన్నతాధికారులు సైతం ఈ విషయంపై ఆరా తీసినట్లు సమాచారం. తమ సమస్యలను గుర్తించి కథనాన్ని, ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినందుకు ఆర్టీసీ కార్మికులు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.

సైబర్ వలలో ఉద్యోగులు

రూ. 2.45 లక్షలు పోగొట్టుకున్న బాధితులు


పటాన్‌చెరుటౌన్: టాస్కులు, కమీషన్ పేరుతో జరిగిన సైబర్ మోసంలో ఇద్దరు డబ్బులు పోగొట్టుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌కు చెందిన ప్రైవేటు ఉద్యోగికి జూన్ 14వ తేదీన టాస్కులు పూర్తి చేస్తే కమీషన్ ఇస్తామంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేస్తూ పలు దఫాలుగా రూ. 1.33 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. అనంతరం బాధితుడు తాను పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని అడుగగా అపరిచిత వ్యక్తి స్పందించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో ఘటనలో పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన ప్రైవేటు ఉద్యోగికి జనవరి 27వ తేదీన పార్ట్‌టైమ్ జాబ్ అంటూ మెసేజ్ వచ్చింది. బాధితుడు తన వివరాలను నమోదు చేసి, నగదు ఇన్వెస్ట్ చేస్తూ ఇచ్చిన టాస్కులు పూర్తి చేశాడు. మొత్తం రూ.1.12 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. పెట్టిన నగదుతోపాటు కమీషన్ ఇవ్వాలని సైబర్ మోసగాళ్లు స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు.

ఎండు గంజాయి పట్టివేత



నిందితుడిని చూపుతున్న పోలీసులు

మునిపల్లి(అందోల్): అక్రమంగా తరలిస్తున్న ఎండు గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ జీ.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఆదివారం మండలంలోని 65వ నంబర్ జాతీయ రహదారి కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టాం. పోలీసులను గమనించి ఓ వ్యక్తి వాహనం తిప్పుకొని పారిపోతుండగా పట్టుకొని తనిఖీ చేయగా 300 గ్రాముల ఎండు గంజాయి దొరికినట్లు తెలిపారు. దాని విలువ రూ.60 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడు ఎండీ. మోహిజ్‌పై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సీహెచ్ చంద్రశేఖర్, ఎస్ఐ యాదయ్య, హెడ్‌కానిస్టేబుల్ ఎండీ అలీమ్, అజంహుసేన్, కానిస్టేబుల్స్ సతీష్, రామారావు, గోపాల్ పాల్గొన్నారు.



వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి ప్రాథమిక పాఠశాలలో మరమ్మతుల అనంతరం మరుగుదొడ్లు



జహీరాబాద్: నీటి ట్యాంకు వద్ద నల్లాల బిగింపు

అమ్మ ఒడిలా.. సర్కారు బడి

మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించిన సర్కారు

- ప్రభుత్వ బడుల్లో వసతుల కల్పన ● అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు
- వేగంగా కొనసాగుతున్న పనులు ● నాడు–నేడు అనే విధంగా మారుతున్న పాఠశాలలు

ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా పాఠశాలల పర్యవేక్షణలో మహిళా సంఘాల సభ్యులను భాగస్వాములను చేసింది. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేసి మౌలిక వసతుల కల్పన, పాఠశాలల బలోపేతానికి అవసరమైన పనులను చేపట్టే బాధ్యత అప్పగించింది. దీంతో అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. పాఠశాలలకు మరమ్మతులు, మరుగుదొడ్లు బాగు చేయిస్తున్నారు. పనులు వేగంగా కొనసాగుతుండగా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మారిన బడి రూపురేఖలు

జగదేవ్‌పూర్(గజ్వేల్): నాడు సకల సమస్యల మధ్య కొనసాగిన ప్రభుత్వ బడి నేడు అన్ని వసతులతో నడుస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద మండలంలోని ధర్మారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు రూ. 3.50 లక్షలు మంజూరు అయ్యాయి. నిధులతో బడిలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు ఏర్పాటుతోపాటు చిన్న చిన్న మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం పాఠశాల సకల వసతుల బడిగా మారింది. ఇటు విద్యార్థులు, అటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఓ పాఠశాలలో తాగు నీటి వసతి

బడులకు సకలం మోక్షం

మిరుదొడ్డి(దుబ్బాక): అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు విడుదలైన నిధులతో సర్కార్ బడుల్లో నెలకొన్న సమస్యలకు మోక్షం లభిస్తోంది. అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కింద రూ. 3.32 లక్షల నిధులు మంజూరయ్యాయి. మంజూరైన నిధులతో పనులను సత్వరమే ప్రారంభించారు. విద్యార్థులకు అవసరమైన తాగు నీరు, పాఠశాల ప్రహరీ గ్రిల్స్, వికలాంగ విద్యార్థులు పాఠశాలలోకి వెళ్లడానికి ర్యాంప్, విద్యార్థులు అనువుగా కూర్చోవడానికి టైల్స్, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం వంటి సదుపాయాలను తక్షణం కల్పించారు. బాలికలకు మరింత మెరుగైన మరుగుదొడ్ల నిర్మాణం కోసం ఈజీఎస్ ద్వారా మరో రూ. 2 లక్షల నిధులు మంజూరు కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు తీర్మానించడం విశేషం.



కూడవెల్లి ప్రాథమిక పాఠశాలలో ర్యాంపు

భవనాలకు మరమ్మతులు

గజ్వేల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం సర్కారు బడుల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టారు. సంగుపల్లి పాఠశాలలోని తరగతి గదులు, వరండాలో పైకప్పు పెచ్చులూడిపోయిన చోట మరమ్మతు పనులను చేపట్టారు. దీని పక్కనే ఉన్న మరో భవనం వద్ద పెరిగిన చెట్టును తొలగించి దానిని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు మరమ్మతులు చేశారు. మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

నిధుల కోసం ఎదురు చూపులు

సంగుపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో కనీస వసతులు, సౌకర్యాల కోసం ప్రభుత్వం రూ.10.5 లక్షలు నిధులను కేటాయించింది. ఈ నిధులతో పాఠశాలలో మరమ్మతు పనులు, విద్యుత్, తాగునీరు, బాత్‌రూమ్‌ల నిర్మాణం చేపట్టారు. అయితే 25 శాతం మాత్రమే నిధులు మంజూరయ్యాయి.

విద్యార్థులకు తీరిన కష్టాలు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలలో మరమ్మతులు, తాగు నీటి సదుపాయం తదితర పనుల కోసం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ(ఏఏపీసీ) ద్వారా రూ.6.35 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో స్కూల్ భవనం ఉరవకుండా స్లాబ్‌కు మరమ్మతు చేశారు. కార్యాలయ గదికి డోర్, విండోస్ తలుపులు బిగించి, ఫ్లోరింగ్ పనులు చేశారు. సంపును నిర్మించి అందులో నీటిని తోడేందుకు మోటార్ బిగించారు. టాయిలెట్ బ్లాకుల గోడ పెంచి రేకులతో రూఫ్ వేశారు. లోపల కొత్త కుండీలు ఏర్పాటు చేశారు. విద్యుత్ వైరింగ్ చేసి ప్రతీ గదిలో రెండు ఫ్యాన్లు, ఒక లైటు చొప్పున బిగించారు.



బొర్రగూడెం పాఠశాలలో పూర్తయిన టాయిలెట్లు

కొనసా...గుతున్న పనులు

పాపన్నపేట (మెదక్): అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పన నిదానంగా కొనసాగుతుంది. స్వయం సహాయక మహిళలకు అనుభవం లేకపోవడంతో సకాలం లో పనులు పూర్తి కావడం లేదని తెలుస్తోంది. మండలంలో 39 పాఠశాలలకు పనులు మంజూరు అయ్యాయి. ఇప్పటి వరకు మొదల్లకుంట, ముద్దాపూర్, చిత్రియల్, ఎంకెపల్లి కాలనీ, పొడిచన్ పల్లి, నాగ్‌సాన్ పల్లి పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తి అయ్యాయి. మిగితా 33 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి. మధిర కొత్తపల్లి పాఠశాల హెచ్ఎం రిటైర్ కావడంతో నిధులు రావేమో అనుమానంతో పనులు జరపడం లేదని తెలుస్తుంది.



మధిర కొత్తపల్లిలో సంపు

50 శాతం పనులు పూర్తి

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ మండలంలోని 42 పాఠశాలలకు అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా నిధులు మంజూరు చేశారు. పనులు చేపట్టిన అమ్మ ఆదర్శ కమిటీలు ఇప్పటి వరకు అన్ని పాఠశాలల్లో 50 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు.



హనుమంతపూర్ పాఠశాలలో సంపు

రూ.1.31 కోట్లు మంజూరు

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల ఆధునీకరణ, బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయి. గత ప్రభుత్వం హయాంలో మన ఊరు–మన బడి పేరిట పలు పాఠశాలల్లో సౌకర్యాలు, కనీస సదుపాయాలు ఏర్పాటు చేయగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట అన్ని పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని పలు పాఠశాలల్లో అభివృద్ధి పనులకు గాను రూ.1.31 కోట్లు మంజూరు కాగా పనులు కొనసాగుతున్నాయి.



రెండు, మూడు రోజుల్లో పూర్తి

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలో ఏడు పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీ కింద నిధులు మంజూరయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల రూ.2.40 లక్షలు, బాలికల ఉన్నత పాఠశాల రూ.1.40 లక్షలు, కాశీనగర్ ప్రాథమిక పాఠశాల రూ.2.10లక్షలు, కేబీ కాలనీ ప్రాథమిక పాఠశాల రూ.7.45 లక్షలు, ఆరపల్లె ప్రాథమిక పాఠశాల రూ.2. 15 లక్షలు, టీచర్స్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు రూ.1.89లక్షలు నిధులతో పనులు చేపట్టారు. ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయని, మరో రెండు, మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని మున్సిపల్ ఏఈ సాయి ప్రణీత్ తెలిపారు.



హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పూర్తయిన టాయిలెట్ల మరమ్మతులు

నిధులు మంజూరు చేసినా..

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను గత ప్రభుత్వము 'మన ఊరు మన బడి' పథకంలో చేర్చి తరగతి గదుల నిర్మాణం, వంట గది, మూత్ర శాలల కోసం నిధులు మంజూరు చేసింది. వంట గది, మూత్ర శాలలను పూర్తి చేసిన బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ తాళం వేసుకున్నాడు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో మైనర్ పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.



తాగు నీటి నల్లా పరిస్థితి

41 పాఠశాలలు ఎంపిక

చేగుంట(తూప్రాన్): మండలంలోని అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి నిధుల కోసం 41 పాఠశాలల్లో రూ.72 లక్షల అంచనా వ్యయంతో పనులు జరుగుతున్నాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మైనర్ రిపేర్, నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పాఠశాలలు నూతన హంగులతో కనిపిస్తున్నాయి.



చేగుంటలో తాగు నీటి సౌకర్యం

రూ.2.45 కోట్లు మంజూరు

జహీరాబాద్: జహీరాబాద్ పట్టణం, మండలంలో 47 పాఠశాలల మరమ్మతులకు గాను రూ.2.45 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇందులో 39 పాఠశాల్లో మరమ్మతులు చేపట్టగా, మరో 8 పాఠశాలల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. మొగుడంపల్లి మండలంలో 21 పాఠశాలలకు గాను రూ. 42 లక్షల నిధులు మంజూరు చేసింది. మొత్తం పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. పాఠశాలల్లో వాటర్ ట్యాంకులను నిర్మించి నీటి సదుపాయం కల్పించడంతోపాటు మరుగుదొడ్లను నిర్మించి వినియోగంలోకి తేవడం, తరగతి గదుల మరమ్మతు, విద్యుత్ తీగలను అమర్చి లైట్లు, ఫ్యాన్ల సౌకర్యం కల్పించే పనులు పూర్తి చేశారు. దీంతో పాఠశాలలు కొత్త హంగులు సంతరించుకుంటున్నాయి.

90 శాతం పనులు పూర్తి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాల్లో అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలను 38 ఎంపిక చేసి పాఠశాలలను మరమ్మతులు చేయించారు. పటాన్‌చెరు మండల పరిధిలో 26 ప్రభుత్వ పాఠశాలలకు రూ.1.25 కోట్లు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. అదే విధంగా అమీన్‌పూర్ మండల పరిధిలో మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలలకు మరమ్మతుల కోసం రూ.43 లక్షల మంజూరు చేశారు. మొత్తం 12 ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 90 శాతం మరమ్మతుల పనులు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.



బచ్చుగూడెం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల

రూ.25 లక్షలు విడుదల

రేగోడ్(మెదక్): మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో ప్రాథమిక పాఠశాలలు 21, ప్రాథమికోన్నత పాఠశాలలు 2, ఉన్నత పాఠశాలలు 4, కేజీబీవీ 1, మోడల్ స్కూల్ 1 ఉన్నాయి. మన ఊరు–మనబడి పథకంలో 9 పాఠశాలలు పనులు జరిగాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 17 ఎంపిక చేశారు. ఇందులో తాగునీటి వసతి, మైనర్ రిపేర్, విద్యుత్, టాయిలెట్స్ పనుల కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేయగా.. ఇప్పటికే రూ.25 లక్షలు నిధులు విడుదల అయ్యాయి. టాయిలెట్స్ మినహా మిగితా పనులు చకచకా సాగుతున్నాయి.



తాగు నీటి సమస్య తీర్చేందుకు ఏర్పాట్లు

కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలన

కొడిపల్లి(నర్సాపూర్): కొడిపల్లి మండలంలోని 60 పాఠశాలలు ఉన్నాయి. 38 పాఠశాలలకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా రూ.1.10 కోట్లు మంజూరు చేశారు. ఇందులో మైనర్ రిపేర్లు, మంచినీటి సౌకర్యం, విద్యుదీకరణ, పెయింటింగ్, టాయిలెట్స్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారు. కాగా, రెండు పాఠశాలల్లో పనులు ప్రారంభం కాలేదు. మిగిత 36 పాఠశాలలో విద్యుత్ సౌకర్యం, మంచినీటి కోసం సంపుల నిర్మాణం, మైనర్ రిపేర్ పనులు జరుగుతున్నాయి. నెల రోజుల కిందట కలెక్టర్ రాహుల్ రాజ్ తునికి ఉన్నత పాఠశాలకు వచ్చి పనులను పరిశీలించి జూన్ 10వ తేదీ వరకు పూర్తి చేయాలని సూచించారు. అయినా ఇంకా పనులు కొనసాగుతున్నాయి.



నిర్మాణంలో ఉన్న సంపు

స్టీరింగ్‌పైనే వదిలిన ప్రాణాలు..

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి!

సదాశివపేట(సంగారెడ్డి): ఆగి ఉన్న లారీలోనే డ్రైవర్ మృతి చెందిన ఘటన సదాశివపేట పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ కథనం మేరకు.. పట్టణ పరిధిలోని ప్రియదర్శిని కాలనీ 65వ నంబర్ జాతీయ రహదారి రోడ్డు పక్కన సంగారెడ్డి వైపు వెళ్తున్న లారీ ఆగి ఉంది. అందులో డ్రైవర్ స్టీరింగ్‌పై పడిపోయి ఉన్నాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బ్లూకోర్టు సిబ్బంది లారీ వద్దకు వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న డ్రైవర్‌ను సదాశివపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఉన్న ఐడెంటీ కార్డును చూసి ఏపీలోని విజయవాడ, మూలపాడుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. లారీ నడుపుతున్న క్రమంలో నాగేశ్వర్‌రావుకు గుండెనొప్పి రావడంతో రోడ్డు పక్కన ఆపి స్టీరింగ్‌పైనే ఒరిగిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. విజయవాడలో ఉంటున్న మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతోపాటు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం రాత్రి మండల పరిధిలోని ఆరూర్ శివారులోని జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. సదాశివపేట సీఐ మహేశ్ కథనం మేరకు.. కర్ణాటకలోని మరియం జిల్లా చించోలి గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింలు(50) ఆరూర్ గ్రామంలోని బంధువుల ఇంటికి విందుకు వచ్చారు. రాత్రి సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

నాచగిరీశుడికి భూదానం

భూ పత్రాలు అందజేసిన దాతలు

వర్గల్(గజ్వేల్): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నాచారం గుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి మరికొంత భూమి సమకూరింది. హైదరాబాద్‌కు చెందిన త్రిగుల్ల అరుణ చంద్రశేఖరశర్మ, ఆమె కుమారులు కృష్ణచంద్రశర్మ, రఘువీర్ శర్మ, నందకిషోర్‌శర్మలకు నాచారంగుట్ట వద్ద హీరాబాయమ్మ తోటలో 28 గుంటల భూమి ఉండగా, ఆదివారం పల్లకీ సేవలో హీరాబాయమ్మతోటకు వేంచేసిన స్వామివారి సమక్షంలో ఆలయ ఈఓ అన్నపూర్ణ భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు, పాస్‌బుక్ స్వీకరించారు. అదే విధంగా దేవాలయ అర్చకులు త్రిగుల్ల గోపాలకృష్ణ శర్మ, త్రిగుల్ల విద్యాసాగర్‌శర్మలు అదేతోట వద్ద వారికి సంబంధించిన 54 చదరపు గజముల ఆర్‌సీసీ భవనం దేవస్థానానికి ఇస్తున్నట్లు పేర్కొంటూ ఈఓకు దానపత్రం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన ముఖ్య అర్చకులు జగన్నాథచార్యులు, వేద పండితులు నాగబాల కామేశ్వర శర్మ, అర్చకులు హరిప్రసాద శర్మ, రమేశ్ శర్మ, నాగరాజు శర్మ, రామకృష్ణశర్మ, ఆలయ జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.




భూపత్రాలు అందజేస్తున్న దాతలు

పోలీసు సిబ్బందికి పతకాలు

సిద్దిపేటకమాన్: తెలంగాణ ఫార్మేషన్ డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సిబ్బందికి సేవా పతకాలు ప్రకటించింది. సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో పతకాలు అందుకున్న వారిలో గౌరారం హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌రావు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ రామ్మోహన్, ఏఆర్ హెడ్ క్వార్టర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య ఉన్నారు.

కారు తీయమన్నందుకు కత్తులతో దాడి



సీసీ ఫుటేజీలో రికార్డయిన దాడి

మునిపల్లి(అందోల్): కారును పక్కకు తీయమన్నందుకు కత్తులతో దాడి చేసిన ఘటన మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టోల్ ప్లాజాలో బైక్‌కు అడ్డుగా ఉన్న కారును పక్కకు తీయాలని విజయ్ అనే వ్యక్తి కారు నడిపే వారిని కోరాడు. దీంతో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. పంజాబ్‌కు చెందిన వారు కారులోంచి దిగి కత్తులతో కుమార్‌పై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్ ప్లాజా సిబ్బంది, స్థానికులు విజయ్ దగ్గరకు వస్తుండడంతో దాడికి పాల్పడినవారు పరారయ్యారు. వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి బుదేరా పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీని పరిశీలించి వివరాలను సేకరించారు.

ఏడుపాయల నీటిలో మునిగి భక్తుడు మృతి

పాపన్నపేట(మెదక్): స్నానం చేసేందుకు ఘనపురం ప్రాజెక్టులోకి వెళ్లి నీట మునిగి ఆదివారం భక్తుడు మృతి చెందాడు. పాపన్నపేట ఏఎస్ఐ సంగన్న కథనం మేరకు ..హైదరాబాద్‌లోని బాలానగర్‌కు చెందిన ఫిరోజ్(21) మరో 12 మంది స్నేహితులతో కలిసి ఏడుపాయలకు దుర్గమ్మ దర్శనానికి వచ్చారు. అందరూ డ్యాం వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు ఫిరోజ్ కాలుజారి నీటిలో మునిగి చనిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన వడియారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మొగిలి వేణు(25) పొలం వద్ద వ్యవసాయ పనులు చేసి ఇంటికెళ్లాడు. పొలం వద్ద కరెంట్ సరఫరా ఆగిపోయిందని పక్కన ఉన్న వారు చెప్పడంతో పొలాలకు విద్యుత్ సరఫరా జరిగే ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ వైర్ వేసేందుకు వెళ్లాడు. ఫ్యూజ్‌వైర్ వేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌తో వేణు కింద పడిపోయాడు. కొన ఊపిరితో ఉన్న అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపాడు.

ఖాతాల హోల్డ్ తీయలేదు..

రైతుబంధు డబ్బులు ఇవ్వలేదు

- పంట రుణానికి ముడిపెట్టొద్దని ఆదేశించిన అధికారులు
- పట్టించుకోని వట్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్

వట్‌పల్లి(అందోల్): ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని, రైతులను బ్యాంకర్లు ఇబ్బందులు పెట్టొద్దని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే చెబుతూ ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ పెట్టుబడి సాయంగా ప్రభుత్వం అందించే రైతుబంధు డబ్బులను పంట రుణానికి ముడిపెట్టొద్దని అధికారులు సైతం చెబుతున్నారు. కానీ వట్‌పల్లి ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ జనార్ధన్ ఇవేవి పట్టించుకోవడం లేదు. పంట రుణం చెల్లించలేదని రైతుబంధు డబ్బులను ఇవ్వకుండా ఖాతాలను హోల్డ్‌లో పెట్టి రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నాడు. ఈ నెల 20న 'సాక్షి' దినపత్రికలో రుణాలు కట్టాల్సిందే అనే కథనానికి స్పందించిన జిల్లా వ్యవసాయాధికారి అంబికాసోని రైతుబంధు డబ్బులను రైతులకు ఇవ్వాలని సూచించి అందుకు సంబంధించిన సర్క్యులర్ కాపీని మండల వ్యవసాయాధికారులు బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. అధికారులు సర్క్యులర్ కాపీ అందజేసి మూడు రోజులు గడుస్తున్నా మేనేజర్ మాత్రం రైతుల ఖాతాలను హోల్డ్‌లో నుంచి తీయలేదు. రైతుబంధు డబ్బులు ఇవ్వలేదని రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఏఈఓ మౌనికను వివరణ కోరగా క్రాప్‌లోన్ పేరుతో రైతుబంధు డబ్బులను పట్టుకోవద్దని రెండేళ్లుగా బ్యాంకు మేనేజర్‌కు చెబుతూనే ఉన్నాం. మూడురోజుల కిందట కూడా ఇదే విషయాన్ని తెలియజేశామన్నారు. బ్యాంక్ మేనేజర్ హోల్డ్‌లో తీసేస్తామని చెప్పినట్లు పేర్కొన్నారు. తాము బ్యాంకుకు వెళ్లి అడిగితే రెన్యూవల్ చేసుకుంటేనే ఖాతాను హోల్డ్‌లో నుంచి తీస్తామని బ్యాంకు మేనేజర్ చెబుతున్నట్లు రైతులు వాపోయారు.